# హాలాహలంలో అమృతం

-రాచపూటి రమేష్

గురువారంరోజు ఉదయం ఎనిమిదింటికే సాయిబాబా మందిరం భక్తులతో కిటకిటలాడుతూ చీమల పుట్టను జ్ఞప్తికి తెస్తోంది. 'ఎన్ని పనులున్నా గురువారం రోజు పొద్దునే బాబా దర్శనం చేసుకు తీరాల్సిందే'నన్న సెంటిమెంటు మా ఆవిడకు బలీయంగా ఉండడంతో క్యూలో ముప్పావుగంట మేమిద్దరం నిలబడక తప్పలేదు. హారతి తీసుకున్న తరువాత హడావుడిగా ఇల్లు చేరుకుని టిఫిన్ తిన్నాననిపించి ఆదరాబాదరగా బస్టాప్‌కు చేరుకున్నాను. బస్సులన్నీ అప్పటికే నిండు గర్భిణిలా మెల్లగా కదులుతున్నాయి. ఆ బస్సులను ఎక్కలేక రెండు బస్‌లను మిస్ చేసాను.

ఆఫీసుకు టైమవుతూ ఉండడంతో మా రూట్ నెంబర్ బస్సు ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదని జనాన్ని తోసుకుంటూ కదులుతున్న బస్ ఎక్కాను.

ఫుట్‌బోర్డుపై నిలుచున్న నన్ను చూసి ఎవరో "ఆ బోర్డు డామేజైంది. త్వరగా పైకి రండి'' అని కేక వేసారు. వగులున్న ఫుట్‌బోర్డు బరువైన నా దేహాన్ని ఎక్కువసేపు మోయలేకపోయింది.

వేగంగా కదులుతున్న బస్సులోంచి కిందపడబోతున్న నన్ను ఎవరిదో చేయి లాఘవంగా పైకి లాగింది.

క్షణకాలంపాటు నా గుండె భయంతో లయ తప్పినట్లయింది. దేవుడ్ని స్మరించుకుని నన్ను కాపాడిన వ్యక్తివంక చూసాను.

టీ షర్ట్, జీన్స్‌లో చిరునవ్వులు చిందిస్తూ నిలుచుని ఉన్నాడతను. పరిచయమైన ఆ ముఖాన్ని ఆశ్చర్యంగా చూసాను.

"అరె... హరీష్ నువ్వా? థాంక్స్‌రా భలే సేవ్ చేసావు నన్ను. అద్సరే. ఇప్పుడెక్కడుంటున్నావు? ఏం చేస్తున్నావు?''

నా ప్రశ్నల పరంపరను చెదరని చిరునవ్వుతో వింటూ "ఈ గోలలో నేను చెప్పేదేమీ నీ బుర్రకెక్కదు. బస్సు దిగిన తరువాత తీరిగ్గా మాట్లాడుకుందాంలే'' అన్నాడు.

హరీష్ నా బాల్యమిత్రుడు. వాడికుండవచ్చు బోలెడంత తీరిక. నాకా అవకాశంలేదే. నేను బస్సు దిగే స్టేజీ దగ్గరకొచ్చింది. హరీష్‌ను నాతో పాటే దిగమని రెక్క పట్టుకుని మా ఆఫీస్ దగ్గరకు లాక్కువెళ్లాను వాడి మాటలు వినిపించుకోకుండా.

వాడినొక కుర్చీలో కూలేసి అప్పటికే ఆఫీసర్ గదికి వెళ్లిపోయిన అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి వచ్చాను.

లక్కీగా మా బాస్ ఇంకా రాకపోవడంతో నాకు అక్షింతలు తప్పినాయి.

పావుగంటసేపు ఓ ఫైల్‌ను రాసి దానిని మా సూపరింటెండెంట్ టేబుల్‌వద్దకు పంపి హరీష్‌ను తీసుకుని ఆఫీస్ కేంటిన్‌కు తీసుకువెళ్లాను.

"ఇప్పుడు చెప్పరా! ఎక్కడ జాబ్ చేస్తున్నావు? పెళ్లయిందా? పిల్లలెందరు?'' కాఫీ తాగుతూ అడిగాను.

హరీష్ నావంక బేలగా చూసాడు. వాడి ముఖంలో ఇంకా పసితనపు ఛాయలు పోలేదు. చిన్ననాటి అమాయకత్వం ఇంకా అలాగే ముఖంలో మిగిలి ఉంది.

"ఏం జాబ్‌లేరా? నీలా నాది గవర్నమెంటులో పర్మినెంట్ ఉద్యోగమా? ఆర్నెల్లకు మారుతూ ఉంటాను. కొందరికి నేను నచ్చకపోతే నాకు కొన్ని జాబ్స్ నచ్చవు'' అన్నాడు నవ్వుతూ.

ఆ నవ్వు నాకు చిన్ననాటి హరీష్‌ను గుర్తుకు తెచ్చింది. మేమున్న వీధిలోనే మూడిళ్ల అవతల ఉండేవాళ్లు హరీష్ వాళ్లు.

వాళ్ల నాన్నకు జాతకాలు చూడడంలోనూ, హస్త సాముద్రికంలోనూ మంచి పేరుండేది. కానీ నలుగురు ఆడపిల్లల తరువాత హరీష్ పుట్టడంతో ఆ అధిక సంతానాన్ని మోయలేక చాలీచాలని ఆదాయంతో నానా అవస్థలు పడుతూ ఉండేవాడు.

ముప్పై ఏళ్లు వచ్చేవరకూ, నేను జాబ్‌లో చేరిన తరువాత కూడా హరీష్ నాకు తారసపడుతూనే ఉండేవాడు.

ఏదో చిట్‌ఫండ్ కంపెనీలో అకౌంటెండెంట్‌గా పని చేస్తూ ఉండేవాడు. ఇంటి పరిస్థితులవలన డిగ్రీ చదువు మధ్యలో ఆపేసి ఉద్యోగం చూసుకోవాల్సి వచ్చిందతను.

ఆసరికి వాడికిద్దరు అక్కల పెళ్లిళ్లు మాత్రమే అయ్యాయి. తమకున్నంతలో సంబంధాలు చూసి బాగానే పెళ్లి జరిపించారు హరీష్ వాళ్ల నాన్నగారు. నాకు దూర ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ అవడంతో ఏడేళ్లుగా హరీష్‌ను చూడడం పడలేదు. ఇప్పుడు మళ్లీ ఈ ఊరికి బదిలీ అవడంతో అనుకోకుండా చూడాల్సి వచ్చింది.

హరీష్‌కు వారంరోజుల్లో మార్వెలెస్ ఫైనాన్స్ కంపెనీలో ఇంటర్వ్యూ వుందిట. ఉద్యోగాలు వెతుక్కుంటూ ఈ పట్టణానికి వచ్చాడట. ఏదో హోటల్లో మడత మంచం తీసుకుని ఉన్నాడట. హరీష్ మరో అక్కకు పెళ్లయినా ఇంకొకరింకా అవివాహితగానే ఉందట. అక్కల పెళ్లిళ్లు ఆలస్యం కావడంతో హరీష్ ఇంకా పెళ్లి ఆలోచన చేయలేదుట. వాళ్ల నాన్న ఆరోగ్యం అంత బాగాలేదని, ఆస్తమా అటాక్ అయిందని చెప్పాడు. చిన్నప్పుడు నాకు మాథ్స్‌లోనూ, సైన్స్‌లోనూ మంచి కోచింగ్ ఇచ్చి టెంత్ క్లాస్ నేను మంచి మార్కులతో పాసవడానికి ముఖ్యకారకుడు హరీష్. రాక రాక మా వూరు వచ్చాడిన్నాళ్లకు.

"ఈ హోటల్‌లో ఏం వుంటావులేరా? వారం

రోజులు మా ఇంట్లోనే వుండు. నీతో సరదాగా గడిపి చాలారోజులైంది'' అన్నాను.

"ఏం ఫర్వాలేదు. హోటల్లో బాగానే వుంది. ఇలాగే అడ్జస్ట్ అయిపోతాను'' అన్నాడు హరీష్.

"అదేం కుదరదు. మా ఇంట్లో వాళ్ల గురించి నీకు బెంగ లేదు. మా ఆవిడ చాలా కలివిడి మనిషి. మా పిల్లలతో సరదాగా నీకు కాలక్షేపం అవుతుంది. వారంరోజులు తెలియకుండానే జరిగిపోతాయి'' అన్నాను పట్టుదలగా.

నేనెంత చెప్పినా వినిపించుకోకుండా హరీష్ తన రూముకు వెళ్లిపోయాడు.

సాయంత్రం నేనింటికి వెళ్లేసరికి లెక్కల్లో మార్కులు తక్కువ వచ్చాయని సెవెంత్‌క్లాస్ చదువుతున్న మా అబ్బాయిపై మా ఆవిడ చిందులు తొక్కుతోంది.

ముఖం కడుక్కుని పడక్కుర్చీలో వాలబోతున్న నాకు మెరుపులాంటి ఐడియా వచ్చింది.

స్కూటర్లో నేరుగా హరీష్ చెప్పిన లాడ్జికి వెళ్లాను. లక్కీగా వాడు తన మడత మంచంపైనే ఏవో అక్కౌంట్స్ పుస్తకాలతో కుస్తీ పడుతున్నాడు. ఏదో ఫర్నిచర్ షాపుకు సేల్స్‌టాక్స్ లెక్కలు రాస్తున్నాడు.

"బతకడానికి ఏదో చెయ్యాలికదా'' అన్నాడు నవ్వుతూ.



"నువ్వేమీ వారంరోజులు ఊరికే మా ఇంట్లో ఉండనవసరంలేదు. మా పిల్లలకు ఎగ్జామ్స్ దగ్గరకొస్తున్నాయి. వాళ్లకు డౌట్స్ చాలా ఉన్నాయి. నాకూ, మా ఆవిడకు ఆ సైన్స్, లెక్కలు అర్థంకావు. నువ్వు ఖాళీ సమయాలలో ఆ సందేహాలు క్లియర్ చేయి'' అన్నాను హరీష్ చేయి పట్టుకుని లేవదీస్తూ.

హరీష్ ఎంత చెప్పినా వినిపించుకోలేదు నేను. కాసేపు మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయాడతను.


చివరకు రహస్యం చెబుతున్నట్లుగా చిన్నగా చెప్పాడు "నేను హెచ్ఐవి పాజిటివ్. ఈ విషయం ఇంకా మా ఇంట్లో కూడా తెలియదు'' అన్నాడు ముఖం దించుకుని.

నా కాళ్లకింద భూమి కంపించినట్లయింది. తక్కున హరీష్ చేయి వదిలేసాను. వెంటనే అందుకు సిగ్గుపడ్డాను.



## సంతోషంగా ఉంది!

లక్ష్మీకల్యాణం, చందమామ, పౌరుడు... సినిమాలలో నటించిన కాజల్ తనకి తెలుగు బాగా వచ్చుంటున్నది. ఇంకా తెలియని మాటలు ఏవైనా వుంటే నేర్చుకుంటున్నానని చెప్పే కాజల్ త్వరలోనే తెలుగు ఇంకా చక్కగ మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నానంటోంది. ఎందుకంటే తనకి తెలుగు సినీ రంగం నుంచి లభిస్తున్న ఆదరణ ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని చెప్తోంది.




నాకు తెలిసినంతవరకూ కలిసి జీవించడంవలన ఎయిడ్స్ ఎవరికీ సోకదు. ప్రభుత్వమూ, స్వచ్ఛంద సంస్థలు హెచ్ఐవి బాధితులపట్ల చూపవలసిన కరుణ, ఆదరణ గురించి చేస్తున్న ప్రచారాన్ని నావంటి విద్యావంతులే పట్టించుకోకపోతే ఎలా? అనుకున్నాను.

"నీకెలాంటి సందేహం అక్కర్లేదు. నా నిర్ణయం మారదు. సూట్‌కేసు సర్దుకుని నా వెంటరా'' అన్నాను.

హరీష్ కళ్లల్లో నీళ్లు నిలిచినట్లు నాకనిపించింది. తక్కున ముఖం తిప్పుకున్నాడు నాక్కనిపించకుండా.

ముఖం కడుక్కుని, సూట్‌కేసు సర్దుకుని నావెనుకే స్కూటర్లో బయల్దేరాడు.

'మార్వలెస్ ఫైనాన్స్ మంచి కంపెనీ అట. జీతాలు బాగుంటాయిట. అందులో జాబ్ దొరికితే బావుండునని' దారి పొడవునా చెప్తూనే వున్నాడు.

ఇంట్లోకి వెళ్లగానే హరీష్‌ను మా ఆవిడ సుమిత్రకు, పిల్లలు రవి, బన్నీలకు పరిచయం చేసాను.

సాయంత్రం ఏడుగంటలు దాటింది.

కాసేపు పిల్లలతో సరదాగా మాట్లాడిన తరువాత హరీష్ అకౌంట్స్ చూసుకుంటూ ఉండిపోయాడు. ఎనిమిదిన్నర అయింది.

"భోజనానికి లేవండి. మీ ఫ్రెండ్‌ను పిలవండి'' పేపర్ చదువుతున్న నాతో అంది మా ఆవిడ.

'హరీష్‌కు మేం తినే ప్లేట్లు, గ్లాసులు ఇవ్వవచ్చా?' నా మదిలో ఏదో అనుమానం మొదలయింది.

పెరటిలోని అరటిచెట్టు నుండి నాలుగు అరిటాకులు కోసుకుని వచ్చాను.

"ఎప్పుడూ లేనిదీ అరిటాకులు కోయడమేమిటి?'' ఆవిడ విసుక్కుంటూ వడ్డించింది.

హరీష్ ముఖంలో ఏ భావమూ నేను చదవలేకపోయాను. భోజనం చేసిన తరువాత గంటసేపు మా పిల్లలకు సబ్జెక్టులో ఉన్న డౌట్స్ క్లియర్ చేసాడు.

వాళ్లు 'అంకుల్...అంకుల్' అంటూ హరీష్ చుట్టూ తిరుగుతున్నారు. ఏవో జానపద కథలు చెబుతూ వాళ్లను మెస్మరేజ్ చేసాడు కాసేపు.

హరీష్ పడుకోవడానికి చాప, మరో పాత దిండు ఇచ్చాను నేను. దివాన్ మీద పడుకోవడానికి అవకాశం ఉన్నా చెప్పలేదు. ఆ దివాన్ కవర్‌ను మొన్ననే నాలుగువందలు పెట్టి ఎగ్జిబిషన్‌లో కొన్నాం.

★★★

మరుసటిరోజు హరీష్ స్నానం చేసి బయటకు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం కూడా భోజనం బయటే చేస్తాడట. నేను ఆఫీసు నుండి వచ్చేసరికి అతనింకా రాలేదు.

నేను స్నానం చేసి బజారుకు బయల్దేరాను.

"ఉండండి... నాకూ బజార్లో పనుంది వస్తాను'' అన్న సుమిత్ర మాటలు పట్టించుకోకుండా వేగంగా బయటకు వచ్చాను.

నేను అరగంట తరువాత తిరిగి వచ్చేసరికి హరీష్ పిల్లలకేదో తమాషా కథ చెబుతున్నాడు.

నవ్వి నవ్వి రవి, బన్నీల కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

నేను లోపల గదిలోకి వెళ్లి సంచీలోంచి నేను తెచ్చిన వస్తువులు రహస్యంగా తీసి టేబుల్‌పై సర్దాను. పింగాణి ప్లేటు, స్టీలుగ్లాసు, కొత్త టవల్, సోపు, నీళ్ల మగ్గు, టూత్‌పేస్ట్.

ఎప్పుడొచ్చాడో హరీష్ గది గుమ్మం వద్ద నిలబడి ఉన్నాడు. నేను టేబు

ల్‌పై వస్తువులు అతనికి కనబడకుండా ఉండడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాను.

"రవికి మేథ్స్‌లో కన్నా సైన్స్ ఎక్కువ ఇంట్రెస్టు. మంచి డాక్టర్ అవగలడు. బన్నీకి లెక్కలు బాగా వస్తున్నాయి. సిఏ చేయించు. బాగా సూటవుతుందా అమ్మాయికి'' అన్నాడు.

నేను శుష్క మందహాసం చేసాను. నా చేష్టలను, హావభావాలను హరీష్ గమనించడంలేదు.

'మనసులో బాధపడుతున్నాడేమో అనుకున్నాను. అయినా నేనెందుకిలా ఎడ్యుకేటెడ్ ఫూల్‌లా బిహేవ్ చేస్తున్నాను? మైగాడ్! హరీష్ మనసు ఎంత బాధ పడి వుంటుందో?' అనుకున్నాను.

'హరీష్‌కి ఈ వ్యాధి ఎందుకు సోకింది? ఎన్నాళ్లనుండీ ఉంది?' ఈ వివరాలన్నీ అడిగి అని మనసును బాధపెట్టదలచుకోలేదు నేను. విధి వైపరీత్యాలవలన ముప్పై అయిదేళ్లపాటు బ్రహ్మచర్య జీవనం గడపవలసి వచ్చింది. అంతమాత్రాన వాడిని దోషిగా చూడడంలేదు. రక్తమార్పిడి, స్టెరిలైజ్ చేయని సిరంజ్‌లు... ఇలా ఎన్నో మార్గాలద్వారా ఆ మహమ్మారి దాపురించవచ్చని చదువుతూనే వున్నాంకదా. ఒకవేళ సుమిత్రకి ఈ విషయం తెలిస్తే ఆమె రియాక్షన్ ఎలా వుంటుంది?'

"మీకు తెలివి లేదా? ఎయిడ్స్ రోగి చుట్టూ పిల్లలను తిరగనిస్తారా? అతను మీకు ఫ్రెండ్ అయితే కావచ్చు. అంతమాత్రాన మనం తినే కంచాలు, వాడే గ్లాసులు, టవల్స్, సోపులు వగైరా అతడ్ని వాడుకోనిస్తామా? మీకు ఏళ్లొచ్చాయిగానీ బుద్ధీ జ్ఞానం పెరగలేదు'' అని నన్ను నిలదీస్తే? 'ఐనా వారంరోజులేకదా హరీష్ మాతో ఉండడం. ఇంటర్వ్యూ కాగానే వాడి దారిన వాడు వెళ్లిపోతాడు' ఆలోచనల్లో ఉన్న నేను "ఏమా పరధ్యానం? కాఫీ తీసుకోండి'' అన్న సుమిత్ర మాటలకు ఉలిక్కిపడి ట్రేలోని కాఫీ గ్లాసు తీసుకున్నాను.

"ఇదిగోండి అన్నయ్యగారూ కాఫీ'' అని సుమిత్ర హరీష్‌కు కాఫీ అందిస్తోంది.

కానీ ఆమె నేను తెచ్చిన కొత్త గ్లాసు కాక మేము వాడే గ్లాసులోనే కాఫీ ఇస్తోంది వాడికి. కాఫీ వద్దంటున్నాడు హరీష్.

నా మనసు ఉలిక్కిపడింది.

ఆమెకు 'హరీష్‌కు వేరే వస్తువులు మాత్రమే వాడాలని' ఎలా చెప్పాలి? కారణం అడిగితే?

నా భావాలు చదివినట్లు హరీష్ "ఒరే రామం! నాకు నిన్న సాయంత్రం బజారులో రమణ అనే పాత మిత్రుడు కలిసాడు. ఒక్కడే కృష్ణానగర్‌లో రూమ్‌లో వుంటున్నాడట. నన్ను తన గదికి వచ్చేయ్యమన్నాడు. ఒక్కడికే గదిలో బోర్‌గా ఉందిట...'' అన్నాడు.

నేను అప్రయత్నంగా తలూపాను.

సుమిత్ర కూరలు తీసుకురావడానికి వీధి చివర్లోని కొట్టుకు వెళ్లినట్టుంది.

హరీష్ తన బేగ్‌ను సర్దుకుని వెళ్లిపోయాడు. నేను మౌనంగా ఆలోచనల్లో ఉండిపోయాను.

సుమిత్ర ఇంట్లోకి అడుగుపెట్టి చుట్టూ ఒకసారి కలియజూసి "హరీష్ అన్నయ్య ఏడండీ'' అంది.

"లేడు... వెళ్లిపోయాడు. వాళ్ల ఫ్రెండ్ ఇంటికి వెళ్తున్నాడుట'' అన్నాను.

"మీరు చేసిన నిర్వాకానికి వెళ్లకేం చేస్తారు? అసలే బాధతో కృంగిపోయి ఉన్న అతని మనసు మరింత కృంగదీసారు. అసలే సెన్సిటివ్ మనిషిలా ఉన్నారు మీ ఫ్రెండ్. వారంరోజులు మీ క్లోజ్‌ఫ్రెండ్‌ను, కష్టాల్లో వున్న అతన్ని ఆదరించకపోతే మీదేం స్నేహమండీ. వెంటనే వెళ్లి తీసుకురండి'' అంది.

నేను నివ్వెరపోయి "అంటే నీకు ఈ విషయం తెలిసిపోయిందా?'' అన్నాను తడబడుతూ.

"నిన్న సాయంత్రం పొరపాటున ఆయన మెడికల్ రిపోర్ట్స్, టాబ్లెట్లు బయటపెట్టి వెళ్లారు. అవి చూడగానే నాకు ఆయన పరిస్థితి అర్థమైపోయింది. తెలిసో తెలియకో ప్రాణాంతక వ్యాధి తెచ్చుకున్నాడు. అయిన వాళ్లు, స్నేహితులు అందరం చీదరించుకుంటే హరీష్‌లాంటి వాళ్ల బ్రతుకే మైపోవాలి? కష్టాల్లోనేకదా స్నేహితుల నైజం బయటపడేది. మారు మాట్లాడకుండా వెళ్లి హరీష్‌ను తీసుకురండి'' అంది సుమిత్ర.

నేను ఆశ్చర్యానందాలతో మునకలవుతూ వీధిలోకి చెప్పులు వేసుకుని పరుగెత్తాను.

★

## 16ఏళ్ళపాటు కడుపులో సూది

క్రోషియాలో 73 ఏళ్ళ మాజీ సైనికుడు తోమాజు పాన్‌కి ఇటీవల విపరీతంగా కడుపు నెప్పి వస్తే ఎక్సరే తీసి ఆపరేషన్ చేసి అతని కడుపులోని సూదిని తీసేసారు. కానీ, అదెలా కడుపులోకి వచ్చిందని ఆరాతీస్తే 1991లో యుగోస్లేవియాలోని అంతర్యుద్ధంలో గాయపడి అతను చావు బతుకుల్లో హాస్పటల్లో చేరినప్పుడు డాక్టర్లు ఆపరేషన్ చేసినప్పుడు ఆ సూది పొరపాటున కడుపులో ఉండిపోయుండవచ్చనుకుంటున్నారు. గత 16 ఏళ్ళుగా అతనికి తరచు కడుపునెప్పి వస్తొంటే ఏవో మందులు వేసుకుంటూ వచ్చాడేకాని ఇది అప్పటి డాక్టర్ల పొరపాటు వల్లనని తెల్సి రాలేదు. ఆ డాక్టర్ల మీద కేసు వేస్తావా అని అడిగితే ఆనాడు తన ప్రాణం కాపాడింది వాళ్ళేనని అతను నవ్వి ఊరుకున్నాడట!

## క్రిందపడ్డా ఫలితం దక్కింది

క్రోషియాలో ఒక బిల్డింగు నిర్మాణం జరుగుతున్నచోట దాని బిల్డరు 27 ఏళ్ళ మిలాన్ క్రోజ్లిక్ కాలుజారి మూడో అంతస్తు పైనుంచి జారి క్రింద అప్పుడే కలగలిసిన కాంక్రీటు మిక్చరులో పడ్డాడుట! అతనికి పెద్దగా దెబ్బలు తగలలేదుకానీ ఆ కాంక్రీటులో తన శరీరం చేసిన ముద్ర చూసి ఆ మిక్చరుని వర్కర్లు సరిగ్గా కలపటం లేదన్న చేదునిజాన్ని తెల్సుకోగలిగాడట! సమయానికి తనకా సంగతి తెల్సి వుండకపోతే ఆ బిల్డింగు తర్వాత వీక్‌గా తయారయివుండేదని అతనన్నాడు.

-విమలారామం

